చూసిన
ప్రతి అమ్మాయిని
నచ్చ లేదంటున్న
అతనిలోనే
లోపమా?

ఎమ్. వారా
కథ

# లోపం


అత్తింటి ఆరడి భరించలేని గృహిణి గుండెలా మండుతున్నాడు సూర్యుడు. అవివాహిత యువతి మనసులా వుంది మిట్ట మధ్యాహ్నపు ఎండ.

ఆ మండుటెండలో, నిప్పులపైన నడుస్తున్నట్లులేదు సింహాచలం. మంచుపై జారుతున్నట్లు, గాలిలో తేలిపోతున్నట్లున్నాడు.

ఆయన ఎండ కన్ను బాగా ఎరిగినవాడే. ఆయనకి ఆడపిల్లలు ఆరుగురు. గుండెలపై కుంపట్లు వున్నవాడికి ఆ ఎండ ఓ లెక్కా. కానేకాదు. అందుకే ఆ పగటి వెన్నెల్లో హుషారుగా నడుస్తున్నాడు. పెద్ద అమ్మాయికి పెళ్ళి స్థిరపరచాలని తెగతొందరపడుతూ పెద్ద పెద్ద అంగలు వేస్తున్నాడు. తప్పిపోతుందని భయపడడటానికి ఆ సంబంధం పరాయిదికాదు. అయినదే. అయినా ఆయన ఆదుర్దా ఆయనది. వరుల కరువు కాలమిది. తప్పదుమరి.

మేనల్లుడు పండుగ శెలవులకి హైదరాబాద్‌నుంచి వచ్చాడని తెలిసిన తరువాత ఇక ఇంటిపట్టున వుండలేక రైలెక్కేశాడు సింహాచలం. గమ్యందాగానే గబుక్కున రైలు దిగాడు. ఎండని లక్ష్యపెట్టకుండా గబగబా చెల్లెలు యింటికి చేరాడు.

కుశల ప్రశ్నల అనంతరం అతి సులువుగా మేనల్లుడ్ని పెళ్లి ముగ్గులోకి లాగాడు సింహాచలం. అవతలవైపునుంచి తానాశించిన ఫలితం కనబడకపోయేసరికి, ఇక ఇది పనికాదని మాటమార్చాడు.



"నువ్వేం నలకూబరుడివికావు. ఆఫ్టరాల్ నా మేనల్లుడివి. మా అప్పలమ్మ రంభకాదు. మీ అమ్మకి మేనకోడలు. దట్సాల్. అందుకని" దీర్ఘంతీస్తూ టిఫిన్‌ప్లేట్ అందుకున్నాడు సింహాచలం.

ఆయన మళ్ళీ కూతబెడుతూ తనతో కబాడీ ఆడకుండా "అప్పలమ్మ నాకు నచ్చలేదు. ఈ పెళ్ళి జరగదు" మురుగ్గా

వినుకున్నాడు అప్పారావు.

"ఏం? ఎందుకని? మనమంతా కోతుం వారసులం. ఒకరినొకరు గేలిచేసుకోవడం అవివేకం. ఒకసారి అద్దంలో చూసుకో. నేనూ, మా అమ్మా, నువ్వూ, మా అప్పలమ్మ కనబడతారు. అవును మరి. మేనత్తా మేనమావ పోలికలు ఎక్కడికి పోతాయి" విరసంగా నవ్వుతూనే సరసంగా వాదనికి దిగాడు.

"అది కాదన్నయ్యా వాడంతగా వద్దంటూంటే ఈ పెళ్ళి శుభంకాదు"మధ్యలో అందుకుని మంచినీళ్ళ గ్లాసు సింహాచలానికి యిచ్చింది సుబ్బులు.

"ఆడవాళ్ళు పుట్టింటిని వెనకేసుకు రావడం సహజం. నువ్వొకోవకి రావు. బాగా మారిపోయావే... సుబ్బులూ... మా అన్నయ్య కూతురికే వంకలు పెడతావాని చెవి మెలివేయక వాడినే సపోర్టు చేస్తావా" ధుమధుమలాడాడు సింహాచలం.

"చిన్నప్పుడు ఆముదం తాగించిన ఈ చేతులతోనే ఇప్పుడు వాడిచేత అమృతం కూడా తాగించలేకపోతున్నానంటే నమ్ము. వాడంతగా మారిపోయాడు. మనమాట వినడు."

కొడుకుని సమర్ధిస్తున్న చెల్లెలు వంకకోపంగా చూస్తున్న సింహాచలం ముఖం ఎర్రబడుతున్నది. అంతవరకు కాఫీ చప్పరిస్తూ సిగరెట్ పొగవదులుతున్న మంగళగిరి ఇక తప్పదని పెదవి విప్పాడు.

"ఎందుకు బావా" అలా వుడికిపోతావు. మన పెద్దరికాలు నిలవాలనే నేనింతవరకు మూగగా వున్నాను. వివాహం వ్యక్తిగత సమస్య అంటాడు మా అప్పుడు. ఇప్పుడు మనం వంచలేని ఎత్తుకి ఎదిగాడు. కాలేజీ చదువులు... హైదరాబాద్‌లో ఉద్యోగం..."

"అయితే ఏమిటంట"

సింహాచలం విసురుగా కసరగానే, వెంటనే సమాధానం చెప్పడానికి వెనకాడిన మంగళగిరి నోట నీళ్ళు నములుతున్నాడు.

రెండు పుష్కరాల క్రితం మంగళగిరికి నాలుగెకరాల మెట్టా, పంచాయితీ గుమాస్తాగిరీ వుండేవి. అదే స్థాయిలో వున్న సింహాచలం, తన చెల్లెల్ని అతనికిచ్చి పెళ్ళిచేశాడు. ఆ దంపతుల ప్రథమ సంతానమే అప్పారావు.

ఇక సింహాచలం కూతురే అప్పలమ్మ. ఆ రెండు కుటుంబాలమధ్య రాకపోకలు జోరుగా వుండటంవల్ల అప్పలమ్మ పుట్టగానే అప్పారావు భార్యగా చెలామణి అయింది. ఇదేం పెద్ద అబ్బురం కాదీ దేశంలో. సర్వ సాధారణమైన మామూలు విషయం మరి.

కాలం గడుస్తున్నది. అంతవరకు సర్వసామాన్యమైన వ్యవసాయదారుడిలా జొన్నా, సజ్జా పండించిన మంగళగిరి కాల క్రమేణా పొగాకూ, ప్రత్తి పంటలతో వ్యాపారస్తుడిలా ఎదిగాడు. దానికి తోడు క్లర్కునుంచి ఎగ్జిక్యూటివ్ ఆఫీసరై పంచాయితీని ఏలుతూ బాగానే కూడబెడుతున్నాడు.

పల్లెలో పుట్టి, బస్తీలో చదివి, సిటీలో ఉద్యోగం వెలగబెడుతున్నాడు అప్పారావు. హైదరాబాద్ చూసిన కళ్ళతో అప్పలమ్మని

తన భార్యగా స్వీకరించడానికి అభిమానపడి 'ఛీ' కొట్టాడు.

కేవలం డబ్బు మనుషులుగా మారారు అతని తల్లిదండ్రులు. పరాయి సంబంధం చేసుకుంటే కట్నం బాగా దండుకోవచ్చునని కొడుక్కి వత్తాసు ఇవ్వసాగారు.

హైయ్యర్ గ్రేడ్ టీచర్‌గా పనిచేస్తున్న సింహాచలం ఆర్థికంగా ఎదగలేకపోయాడు. అప్పలమ్మ తరువాత వరసగా అయిదుగురు ఆడపిల్లలు పుట్టడంతో మరింత కుంగిపోయాడు. అంతంత మాత్రంగావున్న ఆయన ఆస్తి అవసానదశకి చేరింది.

బావా, చెల్లెలు పెద్ద ఎత్తులో వున్నట్లు గ్రహించాడు సింహాచలం. అయినా ఆగ్రహించక వాళ్ళ వెంటపడుతూనేవున్నాడు. ఆడపిల్లల తండ్రికి ఇటువంటి తిప్పలు తప్పవుమరి. మాటా మాటా కలిపి పెళ్ళి ప్రస్తావన తెస్తున్నాడేగాని ముట్టరికపు తాడు తెగేవరకు లాగడం లేదు.

అప్పారావు హైదరాబాద్‌లో ఏమైనా ప్రేమలో పడ్డాడేమోనని అనుమానిస్తున్నాడు. అయినా తొందరపడి బయటపడలేదు.


హైదరాబాద్ వెళ్ళి మేనల్లుడి పేగులు లెక్కపెట్టి, బావా చెల్లెళ్ళ కళ్ళు తెరిపించాలని, నిశ్చయించుకుని ఇంటిదారి పట్టాడు సింహాచలం.

* * *

బావమరిది తోక ముడవగానే అయిన సంబంధం తన కొడుకు కాదన్నాడని చాటింపు వేశాడు మంగళగిరి. అంతే, వేలకివేలు కుమ్మరించి అప్పారావు కాళ్ళు కడగడానికి ఆడపిల్లల తల్లిదండ్రులు పోటీలు పడసాగారు. కొడుక్కినచ్చిన సంబంధం ఓ.కే చేసి కట్నం బాగా మూటగట్టాలని హైదరాబాద్ చేరాడు మంగళగిరి.

అప్పారావు రూంకి ఆయన చేరేసరికి అక్కడ గండుపిల్లిలా ఎదురైనాడు సింహాచలం. వాళ్ళిద్దరూ గుర్రుగా చూసుకున్నారు. ఒకరినొకరు మౌనంగా నిందించుకున్నారు. శాపనార్థాలు పెట్టుకున్నారు.

## కేజీల పత్రిక



ఎక్కువ పేజీలతో పత్రికలు వెలువడడం పోటీ మార్కెట్‌లో ఒక పద్ధతి. ప్రత్యేకమయిన సందర్భాలలో ఎక్కువ పేజీలతో పత్రికలు వెలువడుతుంటాయి. ఆ విషయాన్ని ప్రత్యేకంగా ప్రచారం చేసుకుంటుంటారు. అయితే ఇలా ఎక్కువ పేజీలతో వచ్చే పత్రికలలో ఎక్కువగా ప్రకటనలే వుంటాయి. అమెరికాకు చెందిన ఒక పత్రిక న్యూయార్క్ టైమ్స్ 1963 ఏప్రియల్‌లో తమ ఆదివారం సంచికను 702 పేజీలతో వెలువడింది. ఇలా వస్తే పత్రిక సైజును పేజీలలో కాకుండా కేజీలలో చెప్పాల్సిన అవసరం ఏర్పడుతుందేమో?

వాకేసారి వూడిపడ్డ వాళ్ళిద్దర్ని చూసి అప్పారావు ఉలిక్కిపడలేదు. కంగారు పడలేదు. సరికదా; తాపీగా "నాన్నా... మీరూ వచ్చారా? వెరీగుడ్... 'నా వుడ్‌బి'ని చూడాలని మావయ్య తెగముచ్చట పడుతున్నాడు. మీరూ సరైన టైంకి వచ్చారు. నాటేస్టు చూద్దురుగాని... నా బెటర్ ఆఫ్‌ని... అదే నాక్కాబోయే భార్యని చూద్దురుగాని... రండి వెళ్దాం" అంటూ తొందరచేసి రూంకి తాళం వేశాడు.

మేనల్లుడి మాటలకి అవసరానికి మించి ఆనందించాడు సింహాచలం. మా అమ్మాయిని కాదనందుకు... బావా... ఇక నీ ఆట కట్టు అన్నట్లు మంగళగిరివంక తిరిగి అతి నిర్లక్ష్యంగా, వెక్కిరింపుగా చూశాడు.

కొడుకు వైఖరికి విలవిల్లాడలేదు మంగళగిరి. బావమరిది చూపుకి గిలగిలా తన్నుకున్నాడు.

ముగ్గురూ ఆటో ఎక్కారు. రాజధాని రోడ్లపై కుప్పిగంతులేస్తున్నది ఆటో. ఏదో పారేసుకున్నట్లు పరీక్షగా రోడ్డుకిరువైపులా చూస్తున్న అప్పారావు 'స్టాప్' అని అరిచాడు. ఆటో ఆగింది.

"మావయ్యా" ఆ మెడికల్ షాపుదగ్గర నిల్చున్న అమ్మాయిని బాగా చూడు.

"ఎవర్రా... ఆ పిప్పళ్ళబస్తా..." అంటూ ఓ లావుపాటి ఆడశాల్తీని చూడసాగాడు సింహాచలం.

కొంపదీశావు కదురా... కొడకా... ప్రేమ ప్రేమంటూ, పైసా కట్నం లేకుండా ఆ గున్న ఏనుగుని జీవితాంతం మేపుతావా అంటూ అప్పటికప్పుడు కయ్యానికి కాలుదువ్వలేక, కర్మ... కర్మ అనుకుంటూ హృదయవిదారకంగా కుమిలిపోయాడు మంగళగిరి.

"నాకు కాబోయే భార్య ముఖం, గుండ్రంగా కన్నూ ముక్కూ తీరు అందంగా అమర్చినట్లు ఆ లంబోదరి మొహంలావుండాలి. మొండం మాత్రం... ఆ అదిగో... బ్యూటీక్లినిక్‌లోకి వెళ్తున్న ఆ పిలకజడ అమ్మాయిలా సన్నగా, నాజుగ్గా, స్లిమ్‌గా వుండాలి. అంటే తాత్పర్యం నాక్కాబోయే భార్యకి లంబోదరి ముఖం, పిలకజడ మొండం, అంటే పర్సనాలిటీ వుండాలి. ఎలావుంది నా టేస్టు. ఆటో పోనియ్ " అంటూ తనకి కాబోయే భార్య రూపురేఖలు ఎలా వుండాలో ఏకరువు పెట్టసాగాడు అప్పారావు.

మంగళగిరి ముఖం వింకి వేటయింది. ఆనందంతో ఉప్పొంగిన ఆయన చొక్కా పిగిలింది. చింతాకు ముఖంతో చిన్నబోయిన సింహాచలం నోట మాటే కరువయింది.


ఆటో రివ్వున పోతూనేవుంది. రోడ్డుపై కనబడుతున్న ఆడవాళ్ళని చూపిస్తూ "ఆ రోజ్ కలర్ శారీ అమ్మాయి రంగులో నా భార్య వుండాలి. ఆ చెక్స్ శారీలా నవ్వాలి. ఆ ఫ్రాక్ జడవుండాలి... ఆ స్కర్ట్ నడకవుండాలి. .. బాక్‌నుంచి చూస్తే ఆ జీన్స్ పాంటు అమ్మాయిలా వుండాలి. నా భార్య ఎంత అందంగా, ఎలా వుండాలో చూశావుగా.. ఇక... అదిగో ఆ గుడిదగ్గరున్న పట్టుచీరె ముసలావిడ కనబడుతున్నదా" అంటూ ప్రశ్నించాడు అప్పారావు.


"ఆ ముసలావిడలా నీ భార్య ఎనిమిది మీటర్ల చీరెతో వొళ్ళంతా 'కప్పుకోవాలి.. సతా" చిరాగ్గా కసిరాడు సింహాచలం.

"అలా చీరె కట్టుకోవడమేకాదు గుణవతైవుండాలి. తాను పోయినాసరే, భర్త పదికాలాలపాటు సుఖంగా వుండాలని, నోములూ వ్రతాలూ చేసే పతివ్రతైవుండాలి... ఆటో... ఆపు" అంటూ అరిచాడు అప్పారావు.

ఓ పెద్ద బంగళాముందు ఆటో ఆగింది. ఆ ఇంటిని చూపిస్తూ మళ్ళీ అందుకున్నాడు అప్పారావు.

"నాక్కాబోయే భార్య ఇలాంటి పది బంగళాలకి ఏకైక వారసురాలైవుండాలి.



ఇంటిముందు గుర్ఖా ఇంట్లో కుక్కా వుండాలి. బాత్‌రూంలో బ్లాక్‌మనీ ఇనపెట్టెలో వైట్‌మనీ మూలుగుతూ వుండాలి. ఏడువారాల నగలు, పొలాలు, తోటలు, ఫ్యాక్టరీలు వగైరాలుండాలి."

అతని మాటలకు మురిసిపోయి, అమాంతం కౌగిలించుకుని "మనోవాంఛఫలసిద్ధిరస్తు, ధనగుణరూప భార్య ప్రాప్తిరస్తు" అంటూ పుత్రోత్సాహంతో దీవించాడు మంగళగిరి.

ఆ తండ్రీకొడుకుల అత్యాశని అక్కడికక్కడే ఏవగించి, చీదరించాడు సింహాచలం. వాళ్ళకి తగిన గుణపాఠం చెప్పాలని కనుమరుగైనాడు.

ఆయన ముఖం చాటుచేయగానే ఆ తండ్రీ కొడుకులు మహదానందంతో వధువు వేటకై బయలుదేరారు. లెక్కకి అందని పెళ్ళికూతుళ్ళని చూశారు.

అందంవుంటే ధనం వుండదు. ధనంవుంటే అందం వుండదు. రెండూవుంటే గుణం అనుమానం. అయినా ఆ తండ్రీకొడుకులు పెళ్ళిచూపులకి వెళ్తూనేవున్నారు. ప్రతీ సంబంధంలో వాళ్ళకి ఏదోకలోపం ఎదురవుతూనేవుంది.

ఒకరోజున అప్పారావు రూంకివచ్చి "అప్పిగా మన రొట్టె విరిగి నేతిలో పడింది. ఈ ప్రకటన చూడు" అంటూ పేపరిచ్చాడు మంగళగిరి.

'మింట్‌లాంటి తండ్రీ, కుక్‌లాంటి తల్లిగల అందమైన, గుణవతైన, ధనవంతురాలికి తగిన వరుడుకావాలి, వివరాలతో బాక్స్ నెంబర్ 420కి రాయండి' అని పేపరులో చదవగానే ఉబ్బిపోయాడు అప్పారావు. వెంటనే తన కథంతారాసి పోస్టుచేశాడు.

వారం రోజుల్లో అతనికి జవాబు వచ్చింది. ఆత్రంగా, ఆదుర్దాగా చదివాడు.

ప్రియమైన అప్పారావూ, మైడియర్ పెరాసైట్,

అందుకో నా జవాబు. నీ ఫోటో చూశాను. నువ్వేం నలకూబరుడివి కాదు. ఆఫ్టరాల్ సింహాచలంగారి మేనల్లుడివి. నాలాంటి రంభ నీకు తగదు. నీ మేనమామ కూతురే నీకు సరైన జోడి. సరామరి.

నువ్వో గుమాస్తావి. నలుగురు తమ్ముళ్ళున్నారు. అయిదుగురూ పంచుకుంటే వంశపారంపర్యంగా నీకు వచ్చే ఆస్తి బట్టతల మాత్రమే. ఇంతోటి నీకు నాలాంటి పరమ ధనవంతురాలు కావాలా? సిగ్గులేకపోతేసరి. గంతకి తగిన బొంతని అయిన సంబంధం చేసుకో సుఖపడతావు. మీ మావ యిచ్చే అయిదు వేలతో తృప్తిపడి కాళ్ళు కడిగించుకో. మీనాన్న మాట వినకు. వింటే నీకీ జన్మకి పెళ్ళికాదు. జాగ్రత్త.

ఇక గుణం. నువ్వు చూసిన పెళ్ళి కూతుళ్ళని లెక్కబెట్టడంకన్నా నీ తలపై వెంట్రుకలు లెక్కించడం సులభం. అయినా నీకెవరూ నచ్చలేదు. ఏదో లోపం కనబడుతూనే వుంది. ఇతరుల్లో లోపాలు ఎంచే నీకు నీ లోపం తెలీదు. గురిగింజసామెత. సీతలాంటి భార్య కావాలనుకుంటున్న నువ్వు రాముడంత గొప్పవాడివా? కాదు. నువ్వోక పిచ్చొడివని

లోకం కోడై కూస్తున్నది. నీలాంటి పిచ్చాడికి నాలాంటి అందమైన ధనవంతురాలు కావాలా? నా అందంపై కన్నుకుట్టి ఎవడైనా నాపై అత్యాచారం చేస్తే వాడ్ని ఎదిరించే శారీరక బలం నీకు లేదు. వాడిపై కిరాయి గుండాలు వుసికొల్పడానికి నీకు ఆర్థికబలం లేదు. అత్యాచారానికి గురైన నన్ను ఆదరించే సుగుణం నీకు లేదు. నీవల్ల నా జీవితానికి భద్రతలేదు. నువ్వు నాకు నూటికి నూరుపాళ్ళు తగవు. అందుకని నీకన్నివిధాల సరితూగగల అప్పలమ్మని చేసుకో. సుఖపడతావు. కాదంటావా. నీ కర్మ మరి.

ఇట్లు
బాక్స్ నెంబర్.420
వైజాగ్

అప్పారావు ఉత్తరం చదవడం పూర్తిచేసిన వేళకి, హడావిడిగా వచ్చిన మంగళగిరి గొంతు పెంచాడు.

"పెళ్ళి చూపులకి వస్తామని శ్రీకాకుళం వారికి జాబురాస్తే రావద్దని జవాబువచ్చింది. నీలో ఏదో లోపం వుందని, అందుకే ఏ సంబంధం నచ్చడంలేదని, నీలాంటి పిచ్చాడికి పిల్లనివ్వమని చిత్తూరు వాళ్ళు ఫోన్ చేశారు. ఆ పేపరు ప్రకటనలో ఏదో మోసం వుంది. అన్నీ అన్నీ సక్రమంగా వున్న ఆ పిల్లకి ఇంకా పెళ్ళికాలేదంటే దీంట్లో ఏదో తిరకాసువుంది. ఏదో లోపంవుంది కాబట్టే ఆ నాలుగువందల ఇరవైకి ఇంకా పెళ్ళి కాలేదు. ఆ పిల్ల యిచ్చే రిప్లైకై టైంవేస్టు చేయక నేను చెప్పినట్లు వినరా. బాగుపడతావు. అందంకన్నా ధనమేమిన్న. డబ్బుంటే నీకెలాంటి అందం కావాలంటే అలాంటి దాన్ని అనుభవించవచ్చు.

"కాదనను. పెళ్ళాం డబ్బుతో అందాన్ని కొనుక్కోడానికి నేను బజారుకెళ్ళగానే, మా కోడలు కూడా..." అతని మాటలకి అడ్డువస్తూ "ఛుప్... నోర్మూయ్ ... ఈ దేశంలో - ఆడవాళ్ళు అంతగా దిగజారిపోలేదు" అంటూ కసిరాడు మంగళగిరి.

"అందుకే మనలాంటి వాళ్ళు ఇలా ఎగబడుతున్నారు. నా లోపం ఏదో నేను తెలుసుకున్నాను. నాకు అన్నివిధాల తగిన అప్పలమ్మనే పెళ్ళి చేసుకుంటాను" అన్నాడు దృఢనిశ్చయంతో అప్పారావు.

"ఆ" అంటూ నోటిని బార్లా తెరిచాడు మంగళగిరి.

*



## మేకప్

ప్రముఖ హీరోయిన్ మేకప్ మ్యాన్‌ని ఇంటర్వ్యూ చేస్తున్నాడు విలేకరి.

"మీ మేకప్, అలంకరణ వల్లనే హీరోయిన్ శీలవతి చాలా అందంగా కనిపిస్తుందని అంటారు. ఇంతకు ముందు మీరేం చేసేవారు."

"గంగిరెద్దుల్ని అలంకరించేవాడిని" చెప్పాడు మేకప్ మ్యాన్.

—కోలపల్లి ఈశ్వర్ (నెల్లూరు)